క్లుప్తంగా

ముమ్మరంగా వాహనాల తనిఖీ



ఊట్కూరు: మండలంలోని చెక్‌పోస్టు వద్ద శుక్రవారం ఎస్‌ఐ గోకరి ఆధ్వర్యంలో ముమ్మరంగా వాహనాలను తనిఖీలు చేపట్టారు. మక్తల్, నారాయణపేటకు వెళ్లే వాహనాలను ఆపి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అక్రమంగా మద్యాన్ని తరలించొద్దని తెలిపారు. రూ. 50వేలకు పైబడి నగదును తీసుకెళ్తే సంబంధిత ఆధారాలు చూయించి డబ్బులను తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళ రైతుకు చేయూత



మాగనూర్: మండల పరిధిలోని వర్కూర్ గ్రామానికి చెందిన మహిళ రైతు సావిత్రమ్మకు సుభిక్ష అగ్రి ఫౌండేషన్ పేట ఆధ్వర్యంలో గేదెను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కో ఆర్డినేటర్ శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ.. సావిత్రమ్మ భర్త మల్లేష్ కొన్ని సంవత్సరాల కింద వ్యవసాయంలో నష్టం రావడంతో ఆత్మహత్య చేసుకున్నారు. దీంతో అప్పటి నుంచి ఇద్దరు ఆడపిల్లలు, ఒక బాబును చాలిచాలని డబ్బులతో కుటుంబాన్ని పోషించుకుంటు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామస్తుల సమాచారంతో ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద కుటుంబానికి సాయం చేయాలని సంకల్పించి గేదెను ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు శివ, రవి పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయం ఖాయం

మరికల్: నారాయణపేట నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి ఎవరైనా సరే గెలిచేది తామేనని మండల అధ్యక్షుడు వీరన్న, నాయకులు రామకృష్ణ, హరిష్, కృష్ణయ్య, మొగులప్ప, శేఖర్ అన్నారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అమలు చేయడంలో విఫలమైందన్నారు. పల్లెల్లో బీఆర్ఎస్ నాయకుల ప్రచారానికి గ్రామస్తులు అడ్డుతగులుతున్నారని గుర్తుచేశారు. ప్రజలు అందరు కాంగ్రెస్ వైపు చూస్తున్నారన్నారు. ప్రస్తుతం జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని తెలిపారు. పార్టీ అభ్యర్థిని గెలిపించుకోవడం కోసం పనిచేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

విరాళం అందజేత



మక్తల్: అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బీఆర్ఎస్ అభ్యర్థి చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఎన్నికల నామినేషన్ ఖర్చు విరాళంగా రూ. 25వేల రూపాయాలను మండలంలోని గుర్లపల్లి గ్రామస్తులు శుక్రవారం ఎమ్మెల్యేకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే గుర్లపల్లి గ్రామస్తులను అభినందించారు. కార్యక్రమంలో చిట్టెం సుచరిత, గాలిరెడ్డి, మహిపాల్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్యం చేస్తానంటూ మోసం !

నారాయణపేట రూరల్: పక్షవాతానికి చక్కటి వైద్యం చేస్తానని నమ్మించి డబ్బులతో ఉడాయించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని భైరంకొండ గ్రామానికి చెందిన లాలప్ప మామ అద్రమోని శివరాజప్ప (50) గత ఏడాదికి పైగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. చాలాచోట్ల మందులు తిన్నా తగ్గలేదు. అయితే ఈ నెల 17న చంద్రశేఖర్ అనే వ్యక్తి లాలప్ప ఇంటికి వచ్చి ధన్వంతరి ఆయుర్వేదం అంటు కేరళ ఫిజియోథెరపీ స్పెషలిస్టుగా పరిచయం చేసుకున్నాడు. ప్రభుత్వం తరపున ఉచితంగానే వైద్యం చేస్తామని నిరక్షరాస్యులైన కుటుంబ సభ్యులను నమ్మించాడు. అయితే పెద్ద పెద్ద మిషన్లు, నిష్ణాతులైన వైద్య బృందం ఆదివారం ఇక్కడికి వచ్చి నరాలకు వైద్యం చేస్తే వెంటనే నయమవుతుందని చెప్పాడు. మిషనరీ తీసుకుని రావడానికి ట్రాన్స్‌పోర్టు డబ్బులు ఇస్తే సరిపోతుందని చెప్పి రూ.30వేలు తీసుకెళ్లాడు. పదిరోజులు దాటిన రాకపోవడంతో కార్డులోని నెంబర్‌కు ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వస్తుందని గమనించి గ్రామ పెద్దలకు చెప్పారు. చివరికి డబ్బులు ఇచ్చి మోసపోయినట్లు గుర్తించి లబోదిబోమంటున్నారు. తమకు పోలీసులు న్యాయం చేయాలని కోరుతున్నారు.

ఓటుహక్కును వినియోగించుకోవాలి

- ఫ్లాగ్‌మార్చ్‌లో అదనపు ఎస్పీ



మరికల్‌లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

మరికల్: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఎలాంటి రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గకుండా స్వేచ్ఛతో ధైర్యంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని అదనపు ఎస్పీ నాగేంద్రుడు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రధాన విధుల గుండా ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పల్లెల్లో ప్రజలలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు శాంతియుత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించడానికి సాయుధ బలగాలతో మరికల్, వెంకటాపూర్‌లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించమన్నారు. ఎన్నికల సమయంలో ఓటుకునోటు ఆశచూపితే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. ఓటుహక్కును అమ్ముకోకుండా నిజాయితీగా వినియోగించుకోవడం మన ధర్మమన్నారు. డిసెంబర్‌లో నిర్వహించనున్న సార్వత్రిక ఎన్నికలు శాంతియుతంగా జరిపించేందుకు ప్రతి గ్రామంలో పోలీసులతో కూడిన కవాతును నిర్వహించడం జరుగుతుందన్నారు. సీఐ రాజేందర్, ఎస్ఐ హరిప్రసాద్ రెడ్డి, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



మాగనూర్‌లో పోలింగ్‌బూత్‌లను పరిశీలిస్తు, ఎంపీడీఓ శశికళ



ఊట్కూర్‌లో పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

మాగనూర్: మండలంలోని గురువలింగంపల్లిలో పోలింగ్ బూత్‌లను ఎంపీడీఓ శశికళ శుక్రవారం సదర్శించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ బూత్‌లకోసం ఎంపికచేసిన కేంద్రాలను ఎంపీడీఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గదులలో గాలి, వెలుతురు, విద్యుత్ సౌకర్యం, వికలాంగ్‌లకు ర్యాంపులు తదితర విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఎన్నికలకు కావాల్సిన ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సరస్వతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఊట్కూరు: రాబోయే అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా శుక్రవారం బిజ్వార్, పులిమామిడి తదితర గ్రామాల్లో ఎంపీడీఓ రమేష్‌కుమార్ తనిఖీ చేశారు. పాఠశాలలో పోలింగ్ బూత్‌లకోసం ఎంపిక చేసిన తరగతిగదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ బూత్‌లలో తాగు నీరు, విద్యుత్, ఫ్యాన్‌లు తదితర వసతులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శులు రాజేష్, సబిత పాల్గొన్నారు.

విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు



బాలికల పాఠశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న పోలీసులు

నారాయణపేట రూరల్ : పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా శుక్రవారం జిల్లా వ్యాప్తంగా పోలీస్ శాఖ నిర్వహించిన వ్యాసరచన పోటీలు విజయవంతమయ్యాయి. అక్టోబర్ 21 నుంచి 31వరకు పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ వేడుకల్లో భాగంగా పాఠశాల, కళాశాల విద్యార్థులకు వేర్వేరు అంశాలపై వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేశారు. ప్రభావితమైన పోలిసింగ్ కోసం సాంకేతికత ఉపయోగించడం అంశంపై 8నుంచి ఇంటర్ విద్యార్థులు, సోషల్ మీడియా దుర్వినియోగం అరికట్టడంలో పోలీసుల పాత్ర అంశంపై డిగ్రీ వారికి పోటీలు నిర్వహించారు. ఆయా పీఎస్‌లకు చెందిన అధికారులు హాజరై పర్యవేక్షించారు. ఎస్పీ యోగేష్‌గౌతమ్ మాట్లాడుతూ.. సంఘ విద్రోహ శక్తులతోపోరాటం చేసి వీరమరణం పొందిన పోలీసులను గుర్తు చేసుకోవడం మన ధర్మం అన్నారు. విద్యార్థులకు వారి జీవిత విశేషాలు తెలియజేయడం గురువుల బాధ్యత అన్నారు. విభాగాల వారీగా విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందిస్తామన్నారు.

చిన్నారులను కూలికి పంపించొద్దు



ధన్వాడ: చిన్నారులను కూలిపనులకు పంపించొద్దని చైల్డ్‌హెల్ప్‌లైన్ డిస్ట్రిక్ కో ఆర్డినేటర్ నర్సింహులు అన్నారు. మండల పరిధిలోని వ్యవసాయ పొలంలో పనిచేస్తున్న పత్తి తెంపడానికి వచ్చిన బాల కార్మికులను చూసి వారితో మాట్లాడి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. పిల్లలను పనిలో కాకుండా బడిలో ఉండేట్లు చూడాలని పొలాల యాజమానులకు ఆటో డ్రైవర్లకు తల్లిదండ్రులకు ఎస్ఐ రమేష్ సాయంతో వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో ఐసీపీఎస్ కౌన్సిలర్ విజయ్, కానిస్టేబుల్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ దిష్టిబొమ్మ దహనం



కాంగ్రెస్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కోస్గి: రైతుబంధు పథకంతోపాటు ఇతర పథకాలను నిలిపివేయాలని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కమీషన్‌కు ఫిర్యాదు చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ దిష్టిబొమ్మ దహనంచేసి నిరసన తెలిపారు. ఈ మేరకు స్థానిక శివాజీ చౌరస్తాలో పాలమూర్-తాండూర్ ప్రధాన రహదారిపై బైఠాయించి కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైతులకు అందిస్తున్న రైతుబంధు కొత్తగా ఇచ్చే పథకం కాకపోయినప్పటికి రైతుబంధును నిలిపివేయాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డితోపాటు పలువురు జాతీయ నాయకులు కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం దారుణమన్నారు. రాజకీయాల కోసం రైతులకు నష్టం కలిగించే చర్యలకు పాల్పడుతున్న కాంగ్రెస్ పార్టీకి రైతులు తగిన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు మ్యాకల రాజేష్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ శ్యాసం రామకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ భీంరెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సాయిలుతోపాటు పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇండిపెండెంట్‌గా పోటీచేస్తా..



మక్తల్: నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్‌గా పోటీచేస్తానని, బహుజనలందరూ మద్దతు ఇచ్చి ఆశీర్వదించాలని నియోజకవర్గ నాయకుడు ఆవుల కుర్వ నరేందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని పెద్దపొర్ల, చిన్నపొర్ల గ్రామాల్లో పర్యటించి తమకు ఓటువేసి ఒక్కసారి అవకాశమివ్వాలని కోరారు. బీరప్ప ఆలయంలో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇతర రాజకీయ నాయకుల పార్టీలు తమకు ఎవరు టిక్కెట్ ఇవ్వరని ఓట్లతో తమ సత్తా ఏమిటో చూయించాలన్నారు. నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసం తనవంతు కృషిచేస్తానని చెప్పారు. తమకు ఓటువేసి ఒక్కసారి అవకాశమివ్వాలని కోరారు. విద్యారంగంలో ఉన్న వారిని ఆదుకునేందుకు తనవంతుగా కృషిచేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో నర్వ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటన్న, కుర్వ ఆశప్ప, కుర్వ శివ కుర్వలింగం, గజలప్ప, రాములు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక



మక్తల్: మక్తల్‌కు చెందిన పీసీసీ అధికార ప్రతినిధి ఆశిరెడ్డి, బీజేపీ నాయకుడు జయనంద్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో శుక్రవారం బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో శాట్స్ చైర్మన్ ఆంజనేయులుగౌడ్, జిల్లా రైతుసమితి కన్వీనర్ చిట్టెం సుచరిత, శ్రీనివాస్‌గుప్తా, అమరేందర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



పాఠశాల ఆవరణలో చెత్తను తొలగిస్తున్న పంచాయతీ కార్మికులు

మాగనూర్: పరిసరాల పరిశుభ్రత మన అందరి బాధ్యత అని ఉజ్జెల్లి పంచాయతీ కార్యదర్శి రవికుమార్, పాఠశాల హెచ్‌ఎం సాయిబాబా అన్నారు. శుక్రవారం వారు పాఠశాలలు దసరా సెలవుల అనంతరం పునఃప్రారంభం కావడంతో పాఠశాలతోపాటు పరిసరాలను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఆర్ఏ వెంకటేష్, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

టికెట్ ఖరారు కావడంతో సంబరాలు



నారాయణపేటలో సంబరాలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

నారాయణపేట: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నారాయణపేట నియోజకవర్గ అభ్యర్థిగా చిట్టెం పర్ణికారెడ్డికి అధిష్టానం టికెట్ ఖరారు చేస్తూ ప్రకటించడంతో శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన రహదారుల గుండా కాంగ్రెస్ పార్టీ నినాదాలు చేస్తూ చౌరస్తాలో బాణసంచాపేలుస్తూ మిఠాయిలు పంపిణీ చేశారు. పట్టణంలోని కాంగ్రెస్ నాయకులు సుధాకర్, సలీం, లిఖిరఘుబాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

- బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వర్కటం జగన్నాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న వర్కటం జగన్నాథ్‌రెడ్డి

మక్తల్: నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వర్కటం జగన్నాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆయన నివాసంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు.. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు తనవంతుగా కృషిచేస్తానని అన్నారు. ప్రజలకు వీజేఆర్ ఆధ్వర్యంలో సేవ కార్యక్రమాలు చేస్తే తనపై దాడులకు పూనుకుంటున్నారని అన్నారు. ప్రజల సంక్షేమం కోసం తనవంతు కృషిచేస్తానని చెప్పారు. తమకు ఓటువేసి ఒక్కసారి అవకాశమివ్వాలని కోరారు. అదేవిధంగా జిల్లా అధ్యక్షుడిగా వాకిటి ఆంజనేయులు, నియోజకవర్గ అధ్యక్షుడిగా వెంకటయ్య, జిల్లా ఇన్‌చార్జి అర్జున్‌రాజు, మైనార్టీ కన్వీనర్ ఎండీ అమీర్, వెంకటేష్, రోషనమ్మ, నరేందర్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నరేష్, రమేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్

మరికల్: చాలీచాలని జీతాలతో జీవితం గడుపుతున్నా జేసీబీ, టిప్పర్ల డ్రైవర్లకు కనీస వేతనాలను పెంచేందుకు యాజమాన్యం చర్యలు తీసుకోవాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కిరణ్, సహాయ కార్యదర్శి రామాంజనేయులు అన్నారు. శుక్రవారం మండలంలోని వారు జనరల్‌బాడీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెరిగిన నిత్యావసర వస్తువుల కారణంగా వీరి యాజమాన్యం ఇచ్చేవేతనాలు సరిపోక జేసీబీ, టిప్పర్ల డ్రైవర్లు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. పండగలు వచ్చిన సమయంలో జీతాలు చాలక అప్పులుచేసి పండగలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అంతే కాకుండా యాజమాన్యం సకాలంలో వేతనాలు ఇవ్వకుండా వేదింపులకు గురిచేయడం తగదన్నారు. వెంటనే వారి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకొని నెలకు రూ. 26 వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రామ్మోహన్, అంజి, రాజు, గోపి, నరేష్, భీంరాజ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న లక్ష్మీపతి గౌడ్

ఊట్కూర్: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని లీగల్ ఎయిడ్ కౌన్సిల్ లక్ష్మీపతిగౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని పగిడిమారిలో జిల్లా కోర్టు ఆదేశాలమేరకు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయపరమైన రక్షణ, బాల్యవివాహాలు, బాలకార్మిక చట్టాలు, నకిలీవిత్తనాలు, వరకట్న వేదింపులు, సఖీ కేంద్ర, స్త్రీ వివక్ష తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. దీర్ఘకాలిక కేసులను లోక్ అదాలత్ ద్వారా కేసులను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. సర్పంచ్ సులోచన మురళీధర్‌రెడ్డి, న్యాయవాదులు ఎస్.నాగేశ్వరి, కృష్ణాగౌడ్, ఆశప్ప, బాల్‌రాజ్, పోలీస్ సిబ్బంది మహేశ్, అరవింద్ గ్రామస్తులు విష్ణుమూర్తిగౌడ్, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన భవన నిర్మాణ పనులు



సాగుతున్న కాంప్లెక్స్ నిర్మాణ పనులు

మరికల్: సకాలంలో నిధులు మంజూరు కాకపోవడంతో మండల కాంప్లెక్స్ భవన నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. మండలంలోని శివారులో రూ. 7.50 కోట్ల నిధులతో అన్నిహంగులతో నిర్మిస్తున్న భవన పనులు రెండు నెలల నుంచి నత్తనడకన సాగుతున్నాయి. బిల్లులు మంజూరు కాకపోవడంతో పనులు ఆలస్యమవుతున్నట్లు కాంట్రాక్టర్ తెలుపుతున్నాడు. ప్రస్తుతం ఎన్నికలకోడ్ అమల్లో ఉండటంతో ఇప్పట్లో పెండింగ్ బిల్లులు వచ్చేలా కన్పించడం లేదు. ఇలా అయితే మరోఆరు నెలలైన నిర్మాణపనులు పూర్తయ్యేలా లేదు.

బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం



నారాయణపేటలో ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే సతీమణి స్వాతిరెడ్డి



మరికల్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు

నారాయణపేట: కారు గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డిని మరోసారి గెలిపించి అసెంబ్లీకి పంపించాలని ఆయన సతీమణి స్వాతిరెడ్డి శుక్రవారం స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని ఒకటోవార్డులో ఇంటింటా ప్రచారంచేసి ఓటర్లను అభ్యర్థించారు. కమలం, కాంగ్రెస్ పార్టీల మాయమాటలు నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. దేశానికే ఆదర్శవంతమైన పాలన అందిస్తున్న బీఆర్ఎస్ అధినేత సీఎం కేసీఆర్ వైపు ప్రజలు చూస్తున్నారన్నారు. మరోసారి కారు గుర్తుకు ఓటువేసి రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం వచ్చేందుకు ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. ఆమెతోపాటు మార్కెట్ చైర్‌పర్సన్ మొసటి జ్యోతి, మార్కెట్ మాజీ చైర్మన్ సరాఫ్ నాగరాజు, మాజీ వైస్ చైర్మన్ కన్నా జగదీశ్, నాయకులు గందె చంద్రకాంత్, బండి శివరాంరెడ్డి తదితరులు ఉన్నారు.

మరికల్: మండలంలోని అన్ని గ్రామాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రాజేందర్‌రెడ్డి గెలుపుకోసం శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బసంత్, రాములు, రామస్వామి, విజయ్, రాజేష్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం

మాగనూర్: మండల పరిధిలోని నేరడగంలోని ఏడోవార్డులో పెనుప్రమాదం తప్పింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలోని కొందరు యువకులు బాణసంచా కాల్చడంతో వర్కూర్-నేరడగం ప్రధాన రోడ్డు పక్కన ఇళ్ల మధ్య ఉన్న చెత్త, కంపచెట్లకు మంటలు వ్యాపించి పెద్దఎత్తున మంటలు ఎగిసిపడటంతో పక్కనే ఉన్న 33కేవీ విద్యుత్‌వైర్లకు మంటలు తగిలింది. దీంతో విద్యుత్ సరఫరా ఉన్నసమయంలోనే విద్యుత్‌వైర్లు మంటలదాటికి ఇళ్ల మధ్యలో పడిపోయాయి. అదృష్టవశాత్తు అటుగా ఎవరు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న లైన్‌మెన్ వెంకటేష్ విద్యుత్ సరఫరా బంద్ చేయించారు. బాణసంచా కాల్చే సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలని పలువురు కోరుతున్నారు.



మంటల దాటికి తెగిన విద్యుత్‌వైర్లు